సాక్షి
కుమురం భీం
శనివారం | 27 | జనవరి | 2024

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకలు



జెండా వందనం చేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ఆవరణలో శుక్రవారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి జాతీయ జెండా ఆవిష్కరించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల ఫలితంగా స్వేచ్ఛ, హక్కులు పొందామన్నారు. పౌరులు బాధ్యతతో మెలగాలని సూచించారు. అంతకు ముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

రాజ్యాంగంతోనే పేదలకు న్యాయం



నినాదాలు చేస్తున్న ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

కాగజ్‌నగర్‌రూరల్‌: భారత రాజ్యాంగం ఎంతో పవిత్రమైందని, అందులోని నిబంధనలు సక్రమంగా అమలు చేస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో శుక్రవారం జాతీయ జెండా ఆవిష్కరించారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఎంతో శ్రమించి రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అనంతరం పట్టణంలోని రాంనగర్‌, డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ చౌరస్తా, ఓల్డ్‌కాలనీ, అంబేద్కర్‌ భవన్‌లో జెండాలు ఆవిష్కరించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సాయిచంద్‌ను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

తిర్యాణి(ఆసిఫాబాద్‌): తిర్యాణి మండలం పంగిడిమాదర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న టేకం సాయిచంద్‌ జాతీయస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ గోపాల్‌, పీఈటీ గుండం లక్ష్మణ్‌ తెలిపారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం స్థానిక సర్పంచ్‌ జంగు, ఎంపీటీసీ కేశవరావుతో కలిసి విద్యార్థిని అభినందించారు. కాగా.. సాయిచంద్‌ ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఇంటర్‌ డిస్ట్రిక్ట్‌ అథ్లెటిక్స్‌ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. వచ్చే నెల 14 నుంచి 18 వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్‌ తెలిపారు.

మళ్లీ పెరిగిన చలి

తిర్యాణి(ఆసిఫాబాద్‌): కొన్నిరోజులుగా జిల్లా వ్యాప్తంగా సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా చలి తీవ్రత గణనీయంగా తగ్గిన విషయం తెలిసిందే. అయితే రెండు రోజులుగా జిల్లాను చలి మళ్లీ వణికిస్తోంది. ఒక్కసారిగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చలి గాలులకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శుక్రవారం జిల్లాలోనే అత్యల్పంగా సిర్పూర్‌(యూ)లో 9.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తిర్యాణి మండలం గిన్నెధరిలో 10.5 డిగ్రీలు, ఆసిఫాబాద్‌లో 11.1, కెరమెరిలో 11.4, వాంకిడిలో 12.2, జైనూర్‌లో 13.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో ఈదురుగాలులు వీస్తున్నాయి.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం

వాంకిడి(ఆసిఫాబాద్‌): మహాశివరాత్రి సందర్భంగా వాంకిడి మండల కేంద్రంలోని శివకేశవ ఆలయం వద్ద మార్చి 8న జాతర నిర్వహించనున్నారు. జాతరలో దుకాణాల నిర్వహణకు శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఖమాన గ్రామానికి చెందిన నగోషె భీంరావు రూ.3.73 లక్షలకు దుకాణాల నిర్వహణ హక్కులను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ ప్రవీణ్‌, సర్పంచ్‌ తుకారాం, ఉప సర్పంచ్‌ పవన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో జిల్లా అగ్రగామి



మాట్లాడుతున్న కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే



జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే, పక్కన పోలీసులు, ప్రజాప్రతినిధులు



జాతీయ జెండాతో విద్యార్థిని



మహనీయులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే

- మహనీయులను స్మరించుకుంటూ జిల్లా అభివృద్ధికి కృషి
- కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే
- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఆసిఫాబాద్‌: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ సురేశ్‌కుమార్‌, అదనపు కలెక్టర్లు దీపక్‌ తివారి, దాసరి వేణు, జెడ్పీ చైర్మన్‌ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు కలెక్టర్‌, ఎస్పీలు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. నాలుగు బెటాలియన్లకు చెందిన పోలీసులు కవాతు నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ఎందరో త్యాగాల ఫలితంగా స్వాతంత్య్రం సిద్ధించుకుని, రాజ్యాంగం రూపొందించుకుని స్వేచ్ఛను అనుభవిస్తున్నామని అన్నారు. దేశంలోని ప్రతీ పౌరుడికి కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంత లింగభేదాలు లేకుండా సమాన హక్కులను భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు పొందడంతోపాటు విధులు, బాధ్యతలు తెలుసుకొని దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. స్వాతంత్య్ర పోరాట యోధులు, మహనీయుల ఆశయాలను స్మరించుకుంటూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత కుమురం భీం ఆసిఫాబాద్‌ జిల్లా అన్ని రంగాల్లో ముందుకెళ్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించే సమయంలోనే ప్రభుత్వ దృక్పథం, ప్రజాపాలన ఎలా ఉండబోతుందనేది విస్పష్టంగా ప్రకటించారని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో అధికార యంత్రాంగం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు ప్రదానం చేశారు.

'మహాలక్ష్మి'తో ఉచిత ప్రయాణం

మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని డిసెంబర్‌ 9న ప్రారంభించినట్లు కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే తెలిపారు. ఈ పథకాన్ని జిల్లాలో 57 పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ బస్సుల్లో అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతిరోజూ సుమారు 17,150 మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారని, ఇప్పటివరకు 8,23,184 మంది ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారని వెల్లడించారు. ఆర్టీసీ బస్సుల్లో 54.14 శాతం మహిళా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు.

ఎనిమిది ఆస్పత్రుల్లో 'రాజీవ్‌ ఆరోగ్యశ్రీ'

పేదలకు మెరుగైన వైద్య సేవ సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో రాజీవ్‌ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. పెరిగిన వైద్య ఖర్చులు, అవసరాలకు అనుగుణంగా సేవలు మరింత విస్తృతం చేసి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. రాజీవ్‌ ఆరోగ్యశ్రీ పథకం కింద ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో 1672 రోగాలకు వైద్యం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. జిల్లాలోని 8 ఆస్పత్రుల్లో రాజీవ్‌ ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా డిసెంబర్‌ 28 నుంచి జనవరి 6 వరకు జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి 1,62,412 దరఖాస్తులు స్వీకరించి, ప్రభుత్వ పరిశీలనకు ఆన్‌లైన్‌ చేసినట్లు తెలిపారు. ప్రజాపాలనలో రైతులు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలు యువత, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు, ఉద్యోగులు, కార్మికులు, చేతి వృత్తిదారులతో పాటు అన్ని వర్గాలను పరిగణలోకి తీసుకొని సంక్షేమ కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, ఆర్థిక వికాసంలో రైతే మూలమని, అన్నదాతలను బలోపేతం చేయడం ద్వారా పల్లెలు కళకళలాడే విధంగా చేయడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనసూయ(సీతక్క), స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతి భద్రతలు పరిరక్షిస్తున్న జిల్లా జడ్జి, ఎస్పీ, జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేయడానికి అంకిత భావం, శక్తివంచన లేకుండా కృషి చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో కదం సురేశ్‌, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వేడుకల్లో కలెక్టర్‌ కుమార్తె

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని కలెక్టేట్‌ ఆవరణలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్‌, డీఈవో అశోక్‌, డీటీడీవో రమాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కలెక్టర్‌ కుమార్తె నృత్య ప్రదర్శన ఇచ్చింది. గిరిజన బాలికల పాఠశాల విద్యార్థులు దేశభక్తి పాటపై నృత్యం చేశారు. ఆశ్రమ గిరిజన పాఠశాల విద్యార్థులు గుస్సాడీ పాటతో జోరు చూపించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. అదనపు కలెక్టర్లు దీపక్‌ తివారి, వేణు, డీఆర్‌వో సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.



బాబాపూర్‌ ఉన్నత పాఠశాల విద్యార్థుల నృత్యం



వాంకిడి ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



రెబ్బెన గురుకుల పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన



గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రాజ్యాంగంతో దిశానిర్దేశం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్‌

- ఎస్పీ సురేశ్‌కుమార్‌

ఆసిఫాబాద్‌అర్బన్‌: బీఆర్‌ అంబేద్కర్‌ రాజ్యాంగం రచించి దేశానికి దిశానిర్దేశం చేశారని ఎస్పీ సురేశ్‌కుమార్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు స్వాతంత్య్ర సమరయోధుల పోరాట స్ఫూర్తిని అందించాలన్నారు. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగానే నేడు గణతంత్ర దినోత్సవం జరుపుకొంటున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన విధులను పౌరులు బాధ్యతగా నిర్వర్తించాలన్నారు.



పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్‌

అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 52 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, కాగజ్‌నగర్‌ డీఎస్పీ కరుణాకర్‌, డీసీఆర్బీ డీఎస్పీ రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎంకు 'ఉత్తమ' అవార్డు



సీఎండీ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సురేశ్‌

రెబ్బెన: మండలంలో జూనియర్‌ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న సురేశ్‌కు ఉత్తమ అవార్డు దక్కింది. గణతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం వరంగల్‌లోని కార్పొరేట్‌ కార్యాలయంలో ట్రాన్స్‌కో సీఅండ్‌ఎండీ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డుతోపాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న సురేశ్‌ను మండల ఏఈ ఇమ్రాన్‌, విద్యుత్‌ సిబ్బంది అభినందించారు.

జనసంద్రమైన పుణ్యక్షేత్రం



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

- 'కప్లె'కి తరలివచ్చిన జై జంగో.. జై లింగో దీక్షాపరులు

కెరమెరి(ఆసిఫాబాద్‌): కెరమెరి మండలం శంకర్‌లొద్ది సమీపంలోని కప్లె, సిద్ధికస పుణ్యక్షేత్రం శుక్రవారం జనసంద్రంగా మారింది. ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ జిల్లాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ నుంచి వేలా ది భక్తులు తరలివచ్చారు. జై జంగో.. జై లింగో దీక్షాపరులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. పౌర్ణమి సందర్భంగా గురువారం అర్ధరాత్రి వరకు పూజలు చేశారు. కప్లె గుహలోని దేవతామూర్తులను దర్శించుకునేందుకు బారులు తీరారు. గు హలోకి వెళ్లి పవిత్రమైన కొలనులో పుణ్యస్నానాలు ఆచరించారు. పుణ్యస్నానాలతో దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. జై జంగో.. జై లింగో దీక్షాపరులు శంకర్‌లొద్ది సమీపంలోని సిద్ధికసలో గల శివలింగాన్ని దర్శించుకున్నారు. పాలాభిషేకం, హోమ పూజలు చేశారు. జై జంగో.. జై లింగో నినాదాలతో హోరెత్తించారు.

క్లుప్తంగా

రాజా విద్యానికేతన్ రాజిరెడ్డి మృతి


రాజిరెడ్డి (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి బాబుక్యాంపు బస్తీకి చెందిన రాజా విద్యానికేతన్ వ్యవస్థాపకుడు, తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సొల్లేటి రాజిరెడ్డి (63) మృతి చెందాడు. కొంత కాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయాడు. శుక్రవారం మృతదేహాన్ని బెల్లంపల్లిలోని స్వగృహానికి తీసుకువచ్చారు. రేణికుంట్ల ప్రవీణ్‌తోపాటు ఇతర నాయకులు, ఉపాధ్యాయులు రాజిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజిరెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. రాజిరెడ్డి మృతికి సంతాపంగా శనివారం ప్రైవేట్ పాఠశాలల బంద్ నిర్వహించాలని సంఘ నాయకులు నిర్ణయించారు.

రాజిరెడ్డి మృతికి సంతాపం

శ్రీరాంపూర్: బెల్లంపల్లి పట్టణానికి చెందిన ట్రస్మా నాయకుడు రాజిరెడ్డి మృతిపై అసోసియేషన్ నాయకులు సంతాపం ప్రకటించారు. ట్రస్మా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రపాణి, గౌరవాధ్యక్షుడు బత్తిని దేవన్న, ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన మృతి పాఠశాల విద్యారంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ట్రస్మాలో వివిధ పదవులు చేపట్టి అసోసియేషన్ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు.

29న ఈపీఎఫ్ శిబిరం

మంచిర్యాలటౌన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్‌కు చెందిన అధికారులు ఈ నెల 29వ తేదీన ఖాతాదారులకు అవసరమైన సేవలందించేందుకు ఒక్కరోజు శిబిరాన్ని ఉమ్మడి జిల్లాలోని ఆయా జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సెల్వట్కర్ తానయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లాకు సంబంధించి దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ మీటింగ్ హాల్‌లో, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ది సిర్పూర్ పేపర్‌మిల్స్ లిమిటెడ్ హెచ్‌ఆర్డీ హాల్, బాయ్స్ హాస్టల్, సిర్పూర్ కాగజ్‌నగర్‌లో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో, నిర్మల్‌లోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఈ శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో ఈడీఎల్ఐ పథకం, ఈడీఎల్ఐ అర్హత, లబ్ధిదారుల కేవైసీ, ఈపీఎఫ్‌వో సోషల్ మీడియాపై అవగాహన, తదితర సేవలు పొందవచ్చని తెలిపారు. ఖాతాదారులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గల్లీ నుంచి ఢిల్లీకి..


వరలక్ష్మి


లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని కుమురం వరలక్ష్మి గణతంత్ర వేడుకలకు ఢిల్లీ వెళ్లింది. డిసెంబర్ 24వ తేదీన నాగపూర్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ జాతీయ స్థాయి సైకిల్‌పోలో పాల్గొని కాంస్య పతకం సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గఫార్ తెలిపారు. దీంతో ఈమెను గణతంత్ర వేడుకలకు హాజరు కావాలని ఢిల్లీ నుంచి ఆహ్వానం వచ్చినట్లు పేర్కొన్నారు. ఆమె ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొని ప్రశంసాపత్రం అందుకుందని తెలిపారు. విద్యార్థినిని పాఠశాల పీడీ బండ జీవరత్నం, సిబ్బంది సత్యనారాయణ, శోభారాణి అభినందించారు.


కలెక్టర్ బోర్కడే హేమంత్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ వేణు


తేజస్విని, వాంకిడి ఎస్సై


సురేందర్, డీఆర్డీవో


పోచయ్య, డిప్యూటీ తహసీల్దార్


బాబురావు, ఆర్టీసీ డిపో ఏడీ

ఉత్తములకు ప్రశంసాపత్రాలు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కలెక్టర్ బోర్కడే హేమంత్, ఎస్పీ సురేశ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ కృష్ణ, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్లు దాసరి వేణు, దీపక్ తివారి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు వీరికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఉత్తమ ఉద్యోగులు వీరే..

మొత్తం 31 విభాగాలకు చెందిన 294 మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా అధికారుల నుంచి అదనపు కలెక్టర్ దాసరి వేణు ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. డీఆర్డీవో సురేందర్, డీపీవో అహ్మద్ ఒమర్ హుస్సేన్, రెవెన్యూశాఖ నుంచి ఏవో రఫత్, సూపరింటెండెంట్ మధుకర్, రియాజ్ అలీ, తహసీల్దార్లు రమేశ్, కిరణ్, శ్రీనివాస్, రహీముద్దీన్, డీటీవో ప్రమోద్, డిప్యూటీ తహసీల్దార్లు జితేందర్, పోచయ్య, మస్కూర్ అలీకి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. పోలీస్ విభాగంలో సీఐ నరేందర్, ఎస్సైలు తేజస్విని, ప్రవీణ్, డబ్ల్యూ ఎస్సై సోనియా, పశుసంవర్ధకశాఖలో రాకేశ్, రియాజ్, ప్రభుకుమార్, సమాచారశాఖ నుంచి టైపిస్ట్ రమేశ్, ఫొటోగ్రాఫర్ వెంకటేశ్వర్, శాంతి కమిటీ నుంచి తాటిపల్లి అశోక్, తిరుపతి, మోసిన్, ఫయాజ్, ఎస్సీ కార్పొరేషన్ నుంచి సీనియర్ అసిస్టెంట్ శేషగిరి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ నుంచి సబ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, లైన్‌మెన్లు సురేశ్, శ్రావణ్, పురుషోత్తం, అబ్దుల్ అలాం ప్రశంసాపత్రాలు అందుకున్నారు. బీసీ వెల్ఫేర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ గంగాధర్, మైనార్టీ శాఖ నుంచి తౌసిఫ్, జిల్లా పరిషత్ నుంచి ఎంపీడీవో ప్రసాద్, సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సదాశివ్, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, ఏపీవో చంద్రయ్య, ఆయుష్ నుంచి మెడికల్ అధికారి సుజాత, నాగరాజ్, వ్యవసాయశాఖ నుంచి ఏడీఏ కృష్ణారెడ్డి, ఏఈవో నరేశ్, స్రవంతి, లావణ్య, ఘన్‌శ్యామ్, బ్యాంక్ విభాగంలో మేనేజర్ నరసింహస్వామి, మిషన్ భగీరథలో ఏఈఈ శైలేందర్, రాజశేఖర్, ఏటీవో రవీందర్, ఓఎస్ ఇమాదొద్దీన్, టీఎస్ఆర్టీసీ నుంచి కండక్టర్ కేజే రావ్, మెకానిక్ రషీద్, ఏడీసీ బాబురావ్, డ్రైవర్ తిరుపతికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్లానింగ్‌శాఖలో డీవైఎస్వో శ్రీపాద, తిరుపతి, భూగర్భశాఖ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ, వైద్యవిధాన పరిషత్ నుంచి వందన, లక్ష్మణ్, శ్రీదేవి, ల్యాండ్ సర్వేలో జూనియర్ అసిస్టెంట్ శశికళ, ఆర్‌అండ్‌బీలో డిప్యూటీ ఈఈ లక్ష్మీనారాయణ, సిబ్బంది నగేశ్, హార్టికల్చర్ అధికారి అబ్దుల్ నదీమ్, సోము, ఇంటర్మీడియట్ విద్యాశాఖలో ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు చంద్రయ్య, వైద్యారోగ్యశాఖలో మెడికల్ అధికారి ఫాతిమా, ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్త సోంబాయి, ఎస్సీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఇంటిగ్రేషన్ విభాగంలో డీఏవో సిద్దిఖ్ అలీ, అధికారి తిరుపతి, సీనియర్ అసిస్టెంట్ చంద్ర మండల్, రవాణాశాఖ కార్యనిర్వహణ అధికారి అరుణాబాయి, ఫిషరీస్ శాఖలో వసంత, గ్రామీణాభివృద్ధి శాఖలో అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ శాఖ నుంచి సురేశ్‌బాబు, రమేశ్‌రెడ్డి, రుషి, ఆరిఫ్ అహ్మద్, ముబీన్ పాషా, వాజిద్‌పాషా, భీంరావ్, శ్రీలత, ఉదయ్ రాంప్రసాద్, దేవ్‌రావ్, మధుకర్, స్రవంతి, దినేశ్‌కుమార్, గురుదాస్, రామయ్య, సుమలత, కృష్ణమూర్తి, ఆసిఫ్ అలీ, లక్ష్మి, సంధ్యారాణి, చిన్ను, రాజు కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.


సురేశ్, ఆర్డీవో, ఆసిఫాబాద్


రఫత్, కలెక్టరేట్ ఏవో


తిరుపతి, ఆర్టీసీ డ్రైవర్


రషీద్, ఆర్టీసీ మెకానిక్


చిరంజీవి, ఏఈవో


రుషి, పంచాయతీ సెక్రటరీ


రవి, కలెక్టర్ డ్రైవర్


అహ్మద్ ఒమర్ హుస్సేన్, డీపీవో


లక్ష్మి, ఆసిఫాబాద్


జితేందర్, ఎన్నికల అధికారి


నరేందర్, రెబ్బెన సీఐ


ప్రవీణ్, ఆసిఫాబాద్ ఎస్సై


రియాజ్, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్


సోనియా, కాగజ్‌నగర్ ఎస్సై


సాయిబాబా, కౌటాల ఏఎస్సై


రమేశ్, తహసీల్దార్


అమిత్, డీపీఎం


శ్రీనివాస్, విద్యాశాఖ, కో ఆర్డినేటర్


తిరుపతి, పీస్ కమిటీ సభ్యుడు


గౌతమ్‌రాజ్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్


రమేశ్, డీపీఆర్వో.. టైపిస్ట్


వెంకటేశ్వర్, ఫొటోగ్రాఫర్

జాతీయ జెండాకు అగౌరవం


బెజ్జూర్: రాత్రి 7 గంటల వరకూ తీయని జెండా



దండేపల్లి: మధ్యాహ్నమే కిందకు జారిన జెండా

దండేపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ముత్యంపేట బస్టాండ్ వద్ద ఓ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ జెండా ఎగురవేశారు. జెండా మధ్యాహ్నం వరకే కిందకు జారింది. దీనిని నాయకులెవరూ పట్టించుకోలేదు. ఇది చూసినవారు జాతీయ జెండాను అగౌరవపరిచారని చర్చించుకున్నారు.

బెజ్జూర్ మండల కేంద్రంలో..

బెజ్జూర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డోకె రోజారమణి జాతీయ పతాకాన్ని తలకిందులుగా ఎగురవేశారు. అనంతరం మళ్లీ సరి చేశారు.

బెజ్జూర్ మండలం తాలాయిలో..

బెజ్జూర్ మండలంలోని తాలాయి గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రంలో ఉదయం ఆవిష్కరించిన జాతీయ జెండాలను రాత్రి 7 గంటలు దాటినా తీయలేదు.


బెజ్జూర్: తలకిందులుగా ఎగరేసిన అనంతరం జెండాను సరిచేస్తున్న దృశ్యం

అధికారుల నిర్లక్ష్యంతోనే జాతీయ జెండాకు అవమానం జరిగిందని పలువురు చర్చించుకున్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్తున్న ఓ రైలు కిందపడి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. 30–35 ఏళ్లు గల వ్యక్తి కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ఎర్రని, సన్నని గీతలు గల తెల్ల ఫుల్‌షర్ట్, బూడిద కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్‌కు చెందిన సురేశ్‌పై రెండ్రోజుల క్రితం హత్యాయత్నం చేసిన పోల్‌రాజ్‌ను అరెస్ట్ చేసినట్లు మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పచ్చునూరి సురేశ్, తన్నీరు పోల్‌రాజు కూలీ పనికి వెళ్తూ వచ్చిన డబ్బులతో తాగుడుకు బానిసయ్యారు. విద్యానగర్‌లో నూతన నిర్మాణాల్లో తలదాచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత మంగళవారం కూలీ పనులకు వెళ్లి వచ్చాక అర్ధరాత్రి డబ్బుల విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో సురేశ్‌ను పోల్‌రాజ్ ఇటుకతో కొట్టి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న సురేశ్ అక్క స్వర్ణలత ఘటనా స్థలికి వెళ్లి పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని సురేశ్‌ను మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు పంపించారు. స్వర్ణలత ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి పోల్‌రాజ్‌ను అరెస్ట్ చేశారు.

వేటగాడిపై కేసు

వాంకిడి: మండలంలోని బంబార గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత గురువారం బంబార శివారులోని అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహించగా ఓ చేనులో కుందేళ్లు పట్టేందుకు అమర్చిన ఉచ్చు లభించింది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టి ఉచ్చు ఏర్పాటు చేసిన వ్యక్తి బంబార గ్రామానికి చెందిన డోకె సంజీవ్‌గా గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసి శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వన్యప్రాణులను వేటాడటం నేరమని హెచ్చరించారు. ఎఫ్ఎస్‌వో లక్ష్మణ్, ఎఫ్‌బీవో సుమన్ ఉన్నారు.

విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు విజేతకు సన్మానం


మక్సూద్‌ను సన్మానిస్తున్న అధికారులు

తాండూర్: తాండూర్ మండల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మహ్మద్ మక్సూద్‌ను స్థానిక పంచాయతీ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్, పంచాయతీ రాజ్‌శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న విలేజ్ ఇన్నోవేషన్ అవార్డ్స్–2024 కార్యక్రమంలో భాగంగా మక్సూద్ హోం మేడ్ ప్రాజెక్టర్ తయారుచేసి అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మక్సూద్‌ను సత్కరించి అవార్డు అందజేశారు. సర్పంచ్ నవీన్, జెడ్పీటీసీ సభ్యుడు బానయ్య, పంచాయతీ కార్యదర్శి తపాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి


జెండా ఆవిష్కరిస్తున్న జీఎం సంజీవరెడ్డి


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

శ్రీరాంపూర్: కంపెనీ నిర్దేశించిన 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని సింగరేణి శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం నస్పూర్ గోదావరి కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నైనీ బ్లాక్ లక్ష్యాలు పోను 72 మిలియన్ టన్నులను సాధించాల్సి ఉందని తెలిపారు. శ్రీరాంపూర్‌లో భూగర్భ గనులు 93 శాతం ఉత్పత్తితో నడుస్తున్నాయని పేర్కొన్నారు. కార్మికులకు శుద్ధజలం అందించేందుకు రూ.16 కోట్లతో రాపిడ్ గ్రావిటీ ఫోర్స్ ట్యాంకులు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇటీవల విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఏరియాలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన 18 మంది ఉద్యోగులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, ఎస్వోటూజీఎం రఘుకుమార్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారులు ఎం.శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, ఏవీ రెడ్డి, రాముడు, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమార్, డీవీ రావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం, గనులపై..

జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అన్ని డిపార్టుమెంట్ల ముఖ్య అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్‌లోని పలు గనులపై ఆయా మేనేజర్లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

రిపోర్టర్‌పై కేసు.. రిమాండ్

- జర్నలిస్ట్ ముసుగులో బెదిరింపులు
- ఆరుగురు ముఠాగా ఏర్పడి దందాలు

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలక్రైం: ఒంటరి మహిళలు, యువ జంటలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేస్తున్న నేషనల్ క్రైం బ్యూరో రిపోర్టర్‌ను మంచిర్యాల పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఓ జంటను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసిన వైనంపై శుక్రవారం 'ఒంటరి మహిళలు, యువ జంటలే లక్ష్యం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. సదరు విలేకరి కుదురుపాక పోషంను అరెస్టు చేసి విచారణ జరిపారు. విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. పోషం గతంలో ఓ యూట్యూబ్ చానల్‌లో పని చేశాడని, అందులోనూ అక్రమాలకు పాల్పడడంతో తొలగించారని తెలిసింది. అనంతరం మరో కొత్త చానల్ పేరుతో ఐడీ కార్డు వేసుకుని నేషనల్ క్రైం బ్యూరోగా తనతోపాటు మరో ఐదుగురిని వెంటేసుకుని ముఠాగా ఏర్పడ్డారు. కాగజ్‌నగర్‌కు చెందిన నిరంజన్, నస్పూర్‌కు చెందిన సత్యనారాయణ, పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన మహేష్, మంచిర్యాల కాలేజీ రోడ్‌కు చెందిన శ్రీకాంత్, వినోద్ ముఠాగా ఏర్పడి దందాలకు పాల్పడుతున్నారని తేలింది. ఈ నెల 22న మంచిర్యాలలోని కాలేజీరోడ్డులో ఓ యువ జంటను బెదిరించిన వీడియో వైరల్ కావడం, ఆపై డబ్బులు డిమాండ్ చేయడం తెలిసిందే. బాధితులు రూ.40వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించినట్లు 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీంతో పోలీసులు పోషంతోపాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోషంను రిమాండ్‌కు తరలించగా, త్వరలో మరో ఐదుగురిని రిమాండ్‌కు తరలిస్తామని మంచిర్యాల సీఐ రాజు తెలిపారు.

కనీస మద్దతు ధర చట్టాలు అమలు చేయాలి

పాతమంచిర్యాల: పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని అఖిల భారత కిసాన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. రైతులకు కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయడంలేదని, రుణమాఫీ చేయలేదని, ఉద్యమాల సమయంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయలేదని, ఉద్యమంలో 750 మంది రైతులు చనిపోగా వారి కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం నల్ల చట్టాలను పరోక్షంగా అమలు చేస్తోందని ఆరోపించారు. ప్రజావ్యతిరేక విధానాలు వీడి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్ మజ్దూర్ సంఘ్ నాయకుడు సంకె రవి, ఐఎఫ్‌టీయూ నాయకుడు మేకల రాములు, నాయకులు దొండ ప్రభాకర్, మల్లన్న, రత్నం తిరుపతి, శ్రీకాంత్, సీఐటీయూ నాయకుడు రంజిత్ పాల్గొన్నారు.

కేకే ఓసీలో బోరు పనుల అడ్డగింత


బోరు పనులు అడ్డుకుంటున్న స్థానికులు

కాసిపేట: మందమర్రి ఏరియా కళ్యాణిఖని ఓపెన్ కాస్టులో నిర్వాసిత గ్రామం దుబ్బగూడెం గ్రామస్తులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామశివారు ఓసీలో చేపట్టిన బోరు పనులను స్థానికులు అడ్డుకున్నారు. సింగరేణి అధికారులు ఓసీ ప్రారంభానికి ముందు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మాట ఇచ్చి మూడేళ్లుగా తిరుగుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. తమకు ఉపాధి అవకాశాలు కల్పించి న్యాయం చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేసి ఓసీ పనులు అడ్డుకుంటామని చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
ONE SITTING
■One Sitting Degree, PG, B.Tech, M.Tech, MBA, MCA, B.Sc Nursing, ANM, GNM, Pharmacy. Contact: 81435 83986 [L-806347]

WANTED
■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 38926. [M-1233757]

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024/ 9640400073 [H-793681]

■Hydలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, లేడీ గార్డ్స్, ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. ఏరియా: బాలానగర్, మియాపూర్, జీడిమెట్ల, గండిమైసమ్మ కొల్లూరు రూం ఫ్రీ మెట్రో మేనేజ్‌మెంట్ ఫోన్: 9963077722/ 9885657755 [H-801465]

■అర్జెంటుగా మూతపడ్డ కంపెనీకి వాచ్‌మ్యాన్, సూపర్‌వైజర్ కావలెను. సిర్పూర్ పేపర్ మిల్ ప్రక్కన సర్ సిల్క్ కంపెనీ కాగజ్‌నగర్ జీతం: 6000/- ఉచిత గృహ వసతి కుటుంబంతో ఉండవలెను. సంప్ర: 9440050036 / 7569783139 / 9491824592. [H-787967]

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.